క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ జయకుమార్

నల్లగొండ టూటౌన్: వ్యాధుల పట్ల పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జయకుమార్ అన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే వారికి మెడికల్ క్యాంపు నిర్వహించి స్కిన్ ఎలర్జీకి సంబంధించిన పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు స్విమ్మింగ్ చేసే వారికి స్కిన్ ఎలర్జీ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

మునుగోడు: మండలంలోని కోతులారం గ్రామంలో గత ఏడాది నిర్మించిన కేదారేశ్వర స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలు నిర్వహించారు. సోమవారం దేవతలకు అభిషేకం నిర్వహించనున్నారు. దేవాలయ ఉత్సవాలు ముగింపు రోజు ఆ గ్రామంలోని బొడ్రాయి పండుగను ఆ గ్రామ ప్రజలు నిర్వహించుకోనున్నారు.

ఉత్సవాల కరపత్రం విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం తదితరులు


చిట్యాల: పట్టణంలోని శ్రీ బాలనర్సింహస్వామి కల్యాణోత్సవాల ప్రచార కరపత్రాలను ఆదివారం తన క్యాంపు కార్యాయలంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. ఈ కల్యాణోత్సవాలను ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి కాకులారపు బొర్రారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కనకదుర్గా ఆలయ చైర్మన్ మారగోని అంజనేయులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న సంజయ్‌దాస్‌గౌడ్

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలో ఇటీవల తేనె టీగల దాడిలో గాయపడి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికురాలు జిట్ట మణెమ్మను ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ పరామర్శించారు. కార్మికురాలి కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన బూరుగు సత్యనారాయణగౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి జారి పడి ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను కూడా సంజయ్‌దాస్‌గౌడ్ పరామర్శించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆ నాయకులు పల్లె వెంకన్నగౌడ్, చికిలంమెట్ల అశోక్, గంజి గోవర్ధన్, పురం ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సైదులు

మునుగోడు: పేదలకు అండగా ఉండి సహాయ సహకారాలు అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ మునుగోడు పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు అన్నారు. మండల కేంద్రానికి చెందిన రేవెల్లి సునిత అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం సైదులు ఆదివారం రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భాస్కర్, చిలువేరు సుదర్శన్, సింగం గిరిధర్, రావిరాల కుమారస్వామి, రేవెల్లి మల్లేష్, వనం సైదులు, దుబ్బ రవి, పందుల సంపత్, శ్రీను పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనలతో ఇక్కట్లు

- వర్షాకాలంలో బ్రిడ్జిలపై ప్రవహిస్తున్న వరదనీరు
- గ్రామాల మధ్య నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కేతేపల్లి నుంచి మూసీకి వెళ్లే దారిలో వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

కేతేపల్లి : మండలంలోని పలు గ్రామాల మధ్య వాగులపై నిర్మించిన లోలెవల్ వంతెనలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు రాకపోకలకు ఆటంకం లేకుండా చెరువుల అలుగులు, వాగుల నుంచి వరద నీరు వెళ్లేందుకు వీలుగా మండలంలోని కొర్లపహాడ్-ఇప్పలగూడెం, గుడివాడ-మేడిపల్లిగూడెం, కేతేపల్లి-కొత్తపేట, కొత్తపేట-కాసనగోడు, కొప్పోలు-భీమారం, తుంగతుర్తి-చెర్కుపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై లోలెవల్ బ్రిడ్జిలు నిర్మించారు. ముందు చూపు లేకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడంతో వరద ఉధృతి ఎక్కువైనప్పుడల్లా ఇక్కట్లు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికే బ్రిడ్జిల పైనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి. ఇదిలా ఉండగా రోడ్డు చిన్నగా ఉండటం, వాహనాలు తిరిగి వెళ్లడానికి వీలు కాకపోవడంతో వరద ఉధృతి తగ్గే వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వరద ప్రవాహాన్ని అంచనా వేయలేక బ్రిడ్జి పైనుంచి దాటే ప్రయత్నంలో పలువురు గల్లంతుకాగా వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. గతంలో కేతేపల్లి- కొత్తపేట గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి పైనుంచి బైక్‌పై వరద నీటిని దాటే ప్రయత్నంలో కాసనగోడు గ్రామానికి చెందిన భార్యాభర్తలు కొట్టుకుపోయారు. భర్త అతికష్టం మీద బైటపడి ప్రాణాలు దక్కించుకోగా భార్య వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు విడిచింది. గుడివాడ -నోముల గ్రామాల మధ్యన వరద ఉధృతికి కారు గల్లంతయ్యింది.


గుడివాడ-మేడిపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

విద్యార్థులు, కూలీల అవస్థలు..

మండల కేంద్రమైన కేతేపల్లి - కొత్తపేట గ్రామాల మధ్య మూసీ కుడికాల్వ పక్కన ఉన్న బ్రిడ్జి లెవల్ మరీ చిన్నదిగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే వరదనీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తుంది. దీంతో చదువుల కోసం వెళ్లే బొప్పారం, కాసనగోడు, గుడివాడ, కొత్తపేట గ్రామాల విద్యార్థులు, వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు వరద వచ్చినన్ని రోజులు ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అదే విధంగా ఆయా గ్రామాల నుంచి పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉపాధి పనులకు వెళ్లే కూలీలు సైతం విధులకు హాజరు కాలేక పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోలెవల్ వంతెనల ఎత్తు పెంచి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం



వాగులపై నిర్మించిన వంతెనలు తక్కువ ఎత్తులో నిర్మించడంతో భారీ వర్షాలు కురిస్తే వరదనీరు వంతెనల పైనుంచి ప్రవహిస్తుంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు. వంతెనల ఎత్తును పెంచి ప్రయాణికుల కష్టాలు దూరం చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– పి.జానకిరాములు, కొత్తపేట

వేసవి శిబిరాలతో నైపుణ్యాల పెంపు

- నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎస్పీ

చిట్యాల: విద్యార్థుల్లో క్రీడా, విజ్ఞాన నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిబిరాలు దోహదపడతాయని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి కాల శిబిరం ముగింపు కార్యాక్రమంలో ఆదివారం ఆయన గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గాదె వినోద్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. చెస్, చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనువాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపక సభ్యులు వెల్లంకి లక్ష్మణాచారి, గరిషె అంజయ్య, పంతంగి శ్రీకాంత్, గ్రంథ పాలకుడు గోపగోని శ్రీకాంత్, నమ్ముల ఆనంద్, బొడిగె అంజయ్య, బడే రవి, బురుగు గోపికృష్ణ, బొడిగె స్పూర్తి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గళాన్ని మండలికి పంపండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి


నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రచారం చేస్తున్న రాకేష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి

నల్లగొండ: ప్రశ్నించే గళాన్ని మండలికి పంపాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని ప్రజలకు సేవ చేయాలని వచ్చానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.

మండలికి పంపిస్తే ప్రజల పక్షాన పోరాడుతా

నల్లగొండ టూటౌన్: వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తనను గెలిపించి మండలికి పంపిస్తే ప్రజల పక్షాన పోరాడతానని బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల మ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నల్లగొండలోని ఎన్జీకాలేజీ మైదానంలో వాకర్స్‌ను ఓటు అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, కొండూరు సత్యానా రాయణ, యాట జయప్రద, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్ పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డికి ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గట్టుపల్లి అశోక్‌రెడ్డి

నల్లగొండ టౌన్: లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి కరీంనగర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన మల్టీపుల్ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డా. ప్యాటిహిల్ అందజేసిన అవార్డును మల్టిపుల్ కౌన్సిలింగ్ చైర్మన్ తీగల మోహన్‌రావు అశోక్‌రెడ్డికి అందజేశారు. అశోక్‌రెడ్డికి గోలి అమరేందర్‌రెడ్డి, బాబురావు, సునిల్‌కుమార్, నేతి రఘుపతి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

అనుమతి లేని నిర్మాణ పనులను నిలిపివేయాలి

నాంపల్లి : మండలంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అల్ ఎంప్లాయిస్ యూనియన్ స్థలంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేయించాలని ఆ యూనియన్ నాయకులు గ్యార నరసింహ, గాదెపాక రామచంద్రం గ్రామ కార్యదర్శిని కోరారు. ఆదివారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే ఆ నిర్మాణాలను నిలిపివేసి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గాదెపాక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన సత్యనారాయణగౌడ్

చిట్యాల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు బూరుగు సత్యనారాయణగౌడ్ ఆదివారం గ్రామ పరిధిలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కిందపడ్డాడు. దీంతో అతడి కాలు విరగగా.. చెయ్యికి తీవ్ర గాయమైంది. గాయపడిన సత్యనారాయణగౌడ్‌ను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణగౌడ్‌ను చిట్యాల మండల గౌడ సంఘం అధ్యక్షుడు కూనురు సంజయ్‌దాస్‌గౌడ్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

విద్యుదాఘాతంతో రెండు మేక పిల్లలు మృతి

నార్కట్‌పల్లి: విద్యుదాఘాతంతో రెండు మేక పిల్లలు మృతిచెందాయి. వివరాలు.. నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి తన మేకలను ఆదివారం మేతకు తీసుకొని వెళ్తున్నాడు. గ్రామంలోని దేవాలయం వైపు వెళ్లే దారిలో గల ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి రెండు పిల్లలు వెళ్లగా.. విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతో పాటు ఎటువంటి రక్షణ గోడ లేకపోవడంతో విద్యుదాఘాతానికి గురై మేక పిల్లలు చనిపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పిడుగుపాటుకు గురై ఆవు మృతి

నాంపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామ వాసి నరసింహకు చెందిన వ్యవసాయ పొలంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందింది. ప్రభుత్వం బాధిత రైతుకు ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్లన్నను గెలిపించాలి

మర్రిగూడ : ప్రశ్నించే గొంతుక కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం

మర్రిగూడ : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2006- 07 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులతోపాటు పూర్వ విద్యార్థులు ధనలక్ష్మి, విజయలక్ష్మి, మధుకర్, చంద్రశేఖర్, చంద్రమౌళి, సుధీర్, వినోద్, శంకర్, రమేష్, కాశీ, కిరణ్, గోవర్ధన్‌రెడ్డి, నగేష్, రవి, శ్రీను పాల్గొన్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆదర్శ నాయకుడు.. పుచ్చలపల్లి సుందరయ్య

- సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో సుందరయ్యకు ఘన నివాళి


నల్లగొండ : సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


గట్టుప్పల్ : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడిన ఆదర్శ నాయకుడు.. పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. ఆదివారం సుందరయ్య సెంట్రింగ్ సొసైటీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అద్దంకి నరసింహ, బచ్చలకూరి గురవయ్య, దేవరంపల్లి వెంకట్‌రెడ్డి, పాత లింగయ్య, సాగర్ల మల్లయ్య, ఉంగరాల సైదులు, బొల్లు రవీంద్రకుమార్, శంకర్, యాదయ్య, గిరి పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు పబ్బిల్ల ఐలయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, దండంపల్లి సరోజ, మారయ్య, భూతం అరుణ, వెంకన్న, కళమ్మ, రాజు, ఆంజనేయులు, జ్యోతి, లింగమ్మ, సునిత, నర్సింహ, మల్లమ్మ పాల్గొన్నారు.

మర్రిగూడ : బలహీనవర్గాలకు సుందరయ్య చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం మండల కార్యదర్శి యాదయ్య అన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

నెర్మటలో..

చండూరు : చండూరు మండలం నెర్మట గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి మండల సహాయ కార్యదర్శి ధనంజయ్యగౌడ్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంతిరెడ్డి, ఈరగట్లస్వామి పాల్గొన్నారు.

సుందరయ్య ఆదర్శనీయుడు

రామగిరి(నల్లగొండ): పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయుడని సీపీఎం తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం భిక్షం అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గణేష్, ఆకిటి లింగయ్య, పోకల శేఖర్, జంజరాల ఉమా, గోవర్ధన్‌రెడ్డి, కాసాని సత్తయ్య, పోకల ఝాన్సీ, యల్లయ్య పాల్గొన్నారు.

గట్టుప్పల్‌లో....

గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి గనిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రబ్బాని, కర్నాటి సుధాకర్, ఖమ్మం రాములు, కర్నాటి తుకారం, పెదగాని నర్సింహ్మా, కక్కునూరు నగేష్, చెన్నయ్య, కర్నాటి యాదయ్య ఉన్నారు.

నార్కట్‌పల్లి : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం సీపీఐఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్ర పటానికి పార్టీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి బయ్యన్న, శ్రవణ్‌కుమార్, జాల యాదమ్మ, అర్ధం శ్రీను, అమనగంటి నరేష్, గోపి, ఆమనగంటి అయిలయ్య, శ్రీను ఉన్నారు.

చిట్యాల: చిట్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో, వెలిమినేడులో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. చిట్యాలలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, వెలిమినేడులో ఆ పార్టీ సీనియర్ నాయకుడు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్‌లు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు అర్రూరి శ్రీను, శీలా రాజయ్య, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, అక్కెనపల్లి నాగయ్య, నెల్లికంటి నర్సింహ దేశబోయిన స్వరూప నర్సింహ పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జరుపుకున్నారు.ఆయన చిత్ర పటానికి ఆపార్టీ జిల్లా కార్యదర్శ వర్గ సభ్యురాలు కందాల ప్రమీలా పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో రాచకొండ వెంకట్‌గౌడ్,వంటెపాక వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ వెంకటయ్య, ప్రకాష్‌రావు, భాస్కర్, వంటెపాక కృష్ణ, అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


నకిరేకల్ : పూలమాల వేస్తున్న నాయకులు


నార్కట్‌పల్లిలో..


చిట్యాలలో..

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నార్కట్‌పల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ అంతిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

ఆసిఫ్‌నహర్ కాలువ పనుల పరిశీలన


తక్కెళ్లపహాడ్ వద్ద కాల్వ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాలిగౌరారం: మండలంలోని తక్కెళ్లపహాడ్ వద్ద ఆసిఫ్‌నహర్ కాలువ పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసిఫ్‌నహర్ కాలువను నిర్మించకుండా మండల రైతాంగానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ఆసిఫ్‌నహర్ కాల్వ ద్వారా మండలంలోని భైరవునిబండ, తక్కెళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలకు సాగునీరందనుందని తెలిపారు. ప్రస్తుతం మొదటి విడత పనుల్లో భాగంగా వల్లాల వరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులను నాణ్యతాప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, బండపల్లి కొమరయ్య, షేక్ ఇంతియాజ్, తీర్పారి మల్లయ్య, సురేందర్‌రెడ్డి, భూపతి అంజయ్య, ధనుంజయ్య, నరేశ్, సైదులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నల్లగొండలోని లయన్స్ భవన్‌లో సమావేశమైన దోమలపల్లి ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


చిట్యాల: సమావేశమైన నేరడ జెడ్పీహెచ్ఎస్ 1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


నల్లగొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమైన దోమలపల్లి ఉన్నత పాఠశాల 2003- 2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


సమావేశమైన నల్లగొండలోని జేబీఎస్ స్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన మారగోని లక్ష్మమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఇదే గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నకిరెకంటి శంకరయ్య కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు గుత్తా మాధవరెడ్డి, కొమ్ము వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రేమేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి

చిట్యాల: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి పట్టభద్రులు మద్దతునిచ్చి గెలిపించాలని బీజేవైఎం నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ గరిషె నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భారతీయ జనతా పార్టీ పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పట్టభద్రులంతా మద్దతుగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు.